# ఆకట్టుకున్న కుస్తీ పోటీలు

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 10 : మండల కేంద్రంలో ఉగాది పండుగను పురస్కరించుకొని బుధవారం కుస్తీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల నుంచి వచ్చిన మల్లయోధులు పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కుస్తీ పోటీల వద్ద భారీ జాతర వెలిసింది. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అరిగె సాయిలు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కంది మల్లేశ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

**తిర్మలాపూర్ గ్రామంలో..**

బాన్సువాడ రూరల్, ఏప్రిల్ 10 : బాన్సువాడ మండలం తిర్మలాపూర్ గ్రామంలో కుస్తీపోటీలను గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహంచారు. ఈ పోటీల్లో బాన్సువాడ చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వచ్చిన మల్లయోధులు పోటీల్లో పాల్గొన్నారు. రూ.10 నుంచి మొదలైన పోటీలు రెండు వేలు, వెండి కడెం కుస్తీతో ముగిశాయి. పోటీల్లో గెలుపొందిన మల్లయోధులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రఘు, మాజీ ఉప సర్పంచ్ సద్దాం, పంచాయతీ కార్యదర్శి అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



నస్రుల్లాబాద్‌లో కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు



బాన్సువాడ మండలం తిర్మలాపూర్‌లో కుస్తీపోటీలో తలపడుతున్న మల్లయోధులు



మల్లయోధుడికి బహుమతిని అందజేస్తున్న గ్రామ పెద్దలు

## ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటాం

■ మంత్రి దామోదర రాజనర్సింహ



బిచ్కుందలో మాట్లాడుతున్న
రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ

బిచ్కుంద, ఏప్రిల్ 10: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. బిచ్కుందలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలకు అండగా ఉంటామని, అధైర్య పడొద్దన్నారు. నియోజకవర్గ సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి సురేశ్ షెట్కార్, ఏఐసీసీ కార్యదర్శి విష్ణువర్ధన్, నాయకులు కాసుల బాల్‌రాజ్, కైలాస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అంబలి కేంద్రం ప్రారంభం



అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న
విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నిట్టు విఠల్‌రావు

కామారెడ్డి, ఏప్రిల్ 10 : జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగ సంఘంలో వేసవికాలం ముగిసే వరకు ఉచితంగా రాగి అంబలి కేంద్రాన్ని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నిట్టు విఠల్ రావు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం కోశాధికారి మల్లేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాగౌడ్, మండల యూనిట్ అధ్యక్షుడు ఉపేందర్, కార్యదర్శి నర్సయ్య, కోశాధికారి మనోహర్, రాష్ట్ర కౌన్సిల్ నాగాగౌడ్, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## చదువుతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న డాక్టర్ రమణ

భిక్కనూరు, ఏప్రిల్ 10 : విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ రమణ అన్నారు. భిక్కనూరులోని రెసిడెన్సియల్ స్కూల్‌లో విద్యార్థులకు బుధవారం ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు రమణ మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్ష ప్రణాళికకు అనుగుణంగా చదువుకోవడంలో మార్పులు చేసుకోవాలన్నారు. ఎక్కువ మార్కులు తెచ్చుకోవడం ముఖ్యం కాదని, విద్యార్థులు మానసిక ఆందోళనకు గురికావొద్దని సూచించారు. ప్రిన్సిపాల్ సాయన్న, జిల్లా ఆరోగ్య సామాజిక కార్యకర్త వంగ రాహుల్, ఉపాధ్యాయులు నర్సింహం, శంకర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## రెండో రోజు ఉగాది సంబురాలు

రాజంపేట్, ఏప్రిల్ 10 : రాజంపేట మండలం బస్వన్నపల్లిలో ఉగాది సంబురాల్లో భాగంగా రెండో రోజు పోచమ్మ ఆలయం వద్ద మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు యువకులు జడకొప్పు కోలాటం వేశారు. సాయంత్రం పోచమ్మ, ముత్యాలమ్మ, దుర్గమ్మ, పోలేరమ్మ, నల్లపోచమ్మ ఆలయాల చుట్టూ ఎడ్ల బండ్ల ప్రదర్శన నిర్వహించారు. దుర్గమ్మ గుడి వద్ద జాతర వెలిసింది. ఎడ్ల బండ్లు కట్టిన వారికి రెడ్డి సంఘం తరపున బహుమతులు అందించారు.



బస్వన్నపల్లిలో జడకొప్పు వేస్తున్న యువకులు

## విస్తృతస్థాయి సమావేశానికి తరలిన నాయకులు

బీబీపేట్, ఏప్రిల్ 10 : దోమకొండ మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయ ఆవరణలో దోమకొండ, బీబీపేట్ ఉమ్మడి మండలాల కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి బుధవారం బీబీపేట్‌తోపాటు ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్, ఎంపీపీ బాలమణి, ఎంపీటీసీలు రవి, లక్ష్మారెడ్డి, ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నాటు సారా, బెల్ట్ షాపుల నిర్వహణ కేసులో 12 మంది బైండోవర్

కామారెడ్డి, ఏప్రిల్ 10 : కామారెడ్డి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి రవీందర్ రాజు ఆదేశాల మేరకు కామారెడ్డి పరిధిలోని వివిధ కేసుల్లో నిందితులను బైండోవర్ చేసినట్లు కామారెడ్డి ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన బెల్ట్ షాపు కేసులో ఇద్దరు, నాటుసారా విక్రయించిన కేసుల్లో రామారెడ్డి మండల పరిధిలోని ఏడుగురు, మాచారెడ్డి మండల పరిధితోపాటు సారాయి కేసులో ముగ్గురు మొత్తం 12 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. బైండోవర్ ఉల్లంఘన చేసి తిరిగి కేసుల్లో పట్టుపడితే రెండు సంవత్సరాల జైలు శిక్ష లేదా రూ.రెండు లక్షల జరిమానా విధిస్తామని తెలిపారు.

## నెమలిని రక్షించిన రైతులు

సదాశివనగర్, ఏప్రిల్ 10 : నెమలి ఎండ తీవ్రతను తట్టుకోలేక తాగునీటి కోసం వ్యవసాయ బావిలో దిగి పైకిరాక ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించిన రంగంపేట్ రైతులు బుధవారం కాపాడి అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా బీట్ ఆఫీసర్ శ్రీధర్ మాట్లాడుతూ.. తాగునీటి కోసం బోర్రాగౌడ్ అనే రైతు వ్యవసాయ బావిలోకి దిగిన నెమలిని రైతులు చూసి సమాచారం అందించారన్నారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని బావిలో ఉన్న నెమలిని రైతుల సహకారంతో పైకి తీసినట్లు తెలిపారు. నెమలిని తీసుకెళ్లి అటవీ ప్రాంతంలో వదిలిపెట్టామని అన్నారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారిణి జయశ్రీ, రైతులు బోర్రాగౌడ్, సురేందర్ సింగ్, రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నెమలిని అటవీశాఖ అధికారులకు
అప్పగిస్తున్న గ్రామస్తులు

# ప్రభుత్వ కార్యాలయాలు @ మద్నూర్

- డోంగ్లీ మండలంలో అందుబాటులో లేని ఆఫీసులు
- మద్నూర్‌కు పరుగుపెడుతున్న మండల ప్రజలు

డోంగ్లీ, ఏప్రిల్ 10: ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్తగా మండలాలను ఏర్పాటుచేసింది. ఇందులో భాగంగా 14 గ్రామ పంచాయతీలతో కలిపి డోంగ్లీని ప్రత్యేక మండలంగా ప్రభుత్వం ప్రకటించింది. 18 నెలల క్రితం కొత్త మండలంగా డోంగ్లీ ఏర్పడింది. కానీ ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు కాలేదు. డోంగ్లీలో ఉన్న రైతువేదికలో అరకొర వసతుల మధ్య మండల రెవెన్యూ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. మిగిలిన పలు ప్రభుత్వ కార్యాలయాలు మద్నూర్‌లో ఉన్నాయి. ఇంకా ఇప్పటికీ ప్రజలు తమ పనుల కోసం మద్నూర్‌కు పరుగెత్తాల్సిన పరిస్థితి నెలకొన్నది.

***కొత్త భవనాల నిర్మాణం ఎప్పుడో..?***

పంచాయతీ రాజ్, రోడ్లు భవనాలు, నీటి పారుదల, విద్యాశాఖ తదితర కార్యాలయాన్ని మద్నూర్‌లోనే ఉన్నాయి. పోలీస్‌స్టేషన్ కూడా మద్నూర్‌లో ఉన్నది. డోంగ్లీ మండలంగా ఏర్పాటైనా.. ఇంకా తమ పనుల కోసం మద్నూర్‌కు వెళ్లాల్సి వస్తున్నదని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి కొత్తగా భవనాలు నిర్మించి, అన్ని ప్రభుత్వ కార్యాలయాలను అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు. రెవెన్యూ కార్యాలయంలో కూడా సరైన వసతులు కల్పించాలని అంటున్నారు.





డోంగ్లీలోని రైతువేదికలో ఉన్న తహసీల్ కార్యాలయం

## పదేండ్లలో బీబీ పాటిల్ చేసింది శూన్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

సదాశివనగర్/ రామారెడ్డి, ఏప్రిల్ 10: పదేండ్ల పదవీ కాలంలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ చేసిన అభివృద్ధి శూన్యమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు విమర్శించారు. సదాశివనగర్, రామారెడ్డిలో బుధవారం వేర్వేరుగా నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి అత్యధిక మెజార్టీ వచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూ.5.45లక్షల నగదు పట్టివేత



ఎల్లారెడ్డి, ఏప్రిల్ 10: నిజాంసాగర్ మండలంలోని బ్రాహ్మణపల్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద బుధవారం పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కాందాహార్ తాలూకా పట్వాడా గ్రామానికి చెందిన హుస్సేన్ సాబ్ బోలేరోలో తీసుకెళ్తున్న రూ.5.45లక్షల నగదును పట్టుకున్నారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## పోలీసు విధులపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై కోనారెడ్డి

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్ 10: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు పెద్దకొడప్‌గల్ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్సై కోనారెడ్డి వారికి పోలీసు విధులు, ఆయుధాలపై అవగాహన కల్పించారు. ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రికార్డు( ఎఫ్ఐఆర్) గురించి వివరించారు. సిబ్బంది విధులు, ఆయుధాల పనితీరుపై అవగాహన కల్పించారు. పోలీసులు ప్రజలకు అందించే సేవలను వివరించారు. షీ టీం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది రమేశ్, రవి, ఉపాధ్యాయులు రాములు, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

## అతివేగం ప్రమాదకరం



వాహనాల వేగాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పిట్లం, ఏప్రిల్ 10: వాహనాలను అతి వేగంగా నడపడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని ఎస్సై నీరేశ్ అన్నారు. పిట్లం – బాన్సువాడ రహదారిపై వేగ నియంత్రణ యంత్రంతో పలు వాహనాల వేగాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. వాహనదారులు మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై, పిట్లం – బాన్సువాడ రహదారిపై పరిమితికి మించిన వేగంతో వెళ్లొద్దని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపే వారు సీట్ బెల్టును తప్పకుండా ధరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు కృషిచేయాన్నారు.

## శ్రీ రామాంజనేయ స్వామి ఆలయ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక

గాంధారి, ఏప్రిల్ 10: మండలంలోని గౌరారంలో ఉన్న శ్రీ రామాంజనేయ ఆలయ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. కమిటీ అధ్యక్షుడిగా సజ్జనపల్లి ఎల్లయ్య, ఉపాధ్యక్షుడిగా చాకలి కిషన్, సలహాదారుడిగా బెజుగం అశోక్, సభ్యులుగా మలిపెద్ది అంజయ్య, పద్మ పాపయ్య, కమ్మరి ప్రభు, గాజుల మల్లేశ్, బోర్లం శ్రీనివాస్, రెండ్లబండి రమేశ్, మంగలి శంకర్, గుల్ల గంగారాం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

# షార్ట్ సర్క్యూట్‌తో ఐదు గుడిసెలు దగ్ధం

### రూ.18లక్షల ఆస్తినష్టం .. రోడ్డున పడ్డ ఐదు కుటుంబాలు



ప్రమాదంలో కాలిపోతున్న గుడిసె

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 10: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నివాసపు గుడిసెలు కాలిపోయిన ఘటన లింగంపేట మండలం కొండాపూర్‌తండాలో బుధవారం చోటుచేసుకున్నది. తండావాసులు తెలిపిన ప్రకారం.. తండాలో మధ్యాహ్నం సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించింది. దీంతో ఐదు గుడిసెలకు నిప్పంటుకున్నది. ప్రమాదంలో మంజ ప్రకాశ్, మంజ పర్తాశ్, మంజ నర్బోడ్, మంజ నారాయణ, మంజ బాదల్ సింగ్ గుడిసెలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రమాదంలో బట్టలు, వంట సామాగ్రి, నగదు, వడ్లు, బియ్యం, వెండి, బంగారం కాలిపోయాయి. ప్రకాశ్‌కు రూ.4.46లక్షలు, నర్బోడ్‌కు రూ.3.05లక్షలు, పర్తాశ్‌కు రూ.4.63లక్షలు, నారాయణకు రూ.3.41లక్షలు, బాదల్‌సింగ్‌కు రూ.2.77లక్షల నష్టం వాటిల్లింది. బాధిత కుటుంబాలు కట్టుబట్టలతో మిగిలాయి. తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు. బాధిత కుటుంబాలను జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ పరామర్శించారు. ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

## ఫిజియోథెరపీ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 10: ప్రభుత్వం లక్షలాది రూపాయలను వెచ్చించి భవిత కేంద్రాల్లో ఏర్పాటుచేస్తున్న ఫిజియోథెరపీ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఐఈఆర్పీ దివ్యాంగులకు సూచించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని భవిత భవనంలో బుధవారం ఏర్పాటుచేసిన ఫిజియోథెరపీ శిబిరంలో ఎనిమిది మంది దివ్యాంగ చిన్నారులకు డాక్టర్ అరుణ్ వైద్య సేవలను అందించారు. ఈ సందర్భంగా ఐఈఆర్పీ మాట్లాడుతూ.. శారీరక వైకల్యం ఉన్న చిన్నారులను ఫిజియోథెరపీ శిబిరానికి తప్పకుండా తీసుకురావాలని తల్లిదండ్రులకు సూచించారు. శిబిరంలో ఐఈఆర్పీ శివకుమార్ అప్ప, దివ్యాంగ చిన్నారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలి

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 10: ఎండలు తీవ్రంగా ఉన్నందున ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఎంపీవో ప్రకాశ్ అన్నారు. ఎల్లారెడ్డిలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని, పైప్‌లైన్ లీకేజీలు ఉంటే వెంటనే అరికట్టాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. ప్రతి గ్రామంలో నిత్యం కనీసం 150 మందికి తగ్గకుండా ఉపాధి పని కల్పించాలన్నారు. ఉదయం, సాయంత్రం సమయంలో మాత్రమే పనులు చేయించాలన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.



చిల్లర్గి ఆరోగ్య ఉపకేంద్రంలో మాట్లాడుతున్న ఎంపీడీవో, ఎంపీవో

***చిల్లర్గిలో..***

పిట్లం, ఏప్రిల్ 10: వేసవికాలంలో ఆరోగ్య కార్యకర్తలు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలని ఎంపీడీవో కమలాకర్ సూచించారు. మండలంలోని చిల్లర్గి గ్రామంలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. కేంద్రంలోని వైద్య సిబ్బందితో మాట్లాడారు. వైద్య సిబ్బంది స్థానికంగా ఉండాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఎంపీవో బ్రహ్మం, పంచాయతీ కార్యదర్శి విజయ, ఆరోగ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

గాంధారి, ఏప్రిల్ 10: మండలంలో వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో రాజేశ్వర్ అన్నారు. గాంధారిలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రాధాబలరాం అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో ఇప్పటివరకు చేపట్టిన పనులతోపాటు చేపట్టబోయే పనులను సమావేశంలో వివరించారు. మండల కేంద్రంలోని పలు వార్డులతోపాటు మండలంలోని పలు తండాలకు మిషన్ భగీరథ నీటిని సరిగా సరఫరా చేయడం లేదని ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ ఏఈలను ఎంపీటీసీ సభ్యులు నిలదీశారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ.. గాంధారి – బాన్సువాడ ప్రధాన రహదారిపై పోతంగల్ కలాన్ గేటు నుంచి చందానాయక్ తండా వరకు కంకర వేసి వదిలివేయడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయించాలని కోరారు. మండల సమావేశానికి హాజరు కాని ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, విద్యుత్, అటవీ, ఫారెస్ట్, ఆర్టీసీ అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. సమావేశంలో జడ్పీటీసీ శంకర్‌నాయక్, మండల ప్రత్యేకాధికారి మురళీకృష్ణ, తహసీల్దార్ సతీశ్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది మరియు రంజాన్ శుభాకాంక్షలు..

**బాబా న్యూ వెరైటీ కాంప్లెక్స్ ఉద్యోగము లేనివారు ఆదాయం కొరకు చింతించవద్దు**

మీ సొంత కాంప్లెక్స్‌లో సొంత వ్యాపారం చేసుకొని సులభ వాయిదాలలో 10 లక్కీడ్రా స్కీములో గోల్డ్ కార్డ్ రూ.10,000/- కొనుకొని సభ్యులుగా చేరగలరు. 300 కుటుంబాలకు ఈ సదవకాశం ఇవ్వబడును. మొత్తం 110 కాంప్లెక్స్‌లు. ప్రతి కాంప్లెక్స్‌కు రూ.50,000/- చెల్లించినవారికి 90 రోజులలో కాంప్లెక్స్ తాళంచేవి పొందబడును. రూ 3,00,000/- ప్రతి నెల 1వ తేదిన నెలకు రూ.10,000/- 30 నెలల్లో చెల్లించే అవకాశం. లక్కీడ్రాలో గెలుపొందినవారు రిజిస్ట్రేషన్ వెంటనే చేసుకొనవచ్చును. మొత్తంగా ఒకేసారి డబ్బులు చెల్లించే వారికి 10% డిస్కౌంట్ పొందగలరు. కాంప్లెక్స్ విస్తీర్ణము 13.0 x 13.0 మొత్తం 169 Sft.

1) డ్రా జరుపబడు నెలలు 1,4,7,10,13,16,19,22,25,28 2) డ్రా లో గెలుపొందిన వారు తదుపరి నెల నుండి డబ్బులు చెల్లించనవసరం లేదు.
3) ఇట్టి కాంప్లెక్స్‌లు NH-44 1 కి.మీ లోపల ఇల్చిపూర్ శివారులోని సర్వే నెంబర్లలో 124, 133, 139, 156/3/1/1 లలో ఈ కాంప్లెక్స్‌ల నిర్మించి ఇవ్వబడును.
4) ఇందులో పైన రేకుల కప్పు, సిమెంట్ పలకలతో నెల టైల్స్, షెట్టర్, పైన సిల్లింగ్ పటిష్టంగా నిర్మించి ఇవ్వబడును.
ఈ సువర్ణవకాశమును వినియోగించుకొనగలరు.

BINDU SAGAR CONSTRUCTION PVT.LTD HYDERABAD
G-3, Mounika Paradise, Pragathinagar, Opp.JNTU, Kukatpally, Hyd.

P. BHARAIAH GUPTA
H.No.1-6-39/1, Gandhiganj,
Kamareddy Cell: 9951094145

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**WANTED**

★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311823-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.